# తప్పటడుగు

(కథానిక)

"ఓసి కొయ్యికొల్లదానా అసలు నాపుల్లెందుకు తియ్యాలే?" అంటూ వున్నది పడుచు కంఠధ్వని.

"కొయ్యమీస నాపసానా" ముసలికంఠం ముదలకించింది.

"వూరుకోమంటుంటే మీకు కాదంటే" మగగొంతు మందలించింది. తిట్ల తమాషా తీర్థంలోనుంచి వస్తున్న నన్నా వైపుకు ఆకర్షించింది.

నీటికి చేరువగా నావకోలలు యిసుకలో పాతి తెరచాపలతో గుడారం వేసికొని అందులోవున్నారు చేపలు పట్టుకొనే జాలారులు. ఆగుడారంలోని గుంపులోనించే గలభా.

నేను గుడారం సమీపించగానే, "అయ్యగారూ నావ కట్టమన్నారా?" అన్నాడొకడు బయటికివస్తూ. నన్ను చూడగానే తిట్ల సందడి చటుక్కున మాటు మణిగింది.

"వద్దోయ్! లాంచికోసమొచ్చాను" అన్నాను. నదిమీద నాట్యంచేస్తున్న వాళ్ళ నావలువైపు చూస్తూ.

"జనంఅంతా లాంచీలకే పోతున్నారు!" అన్నాడు తీర్థం వేపుచూస్తూ.

నేను మాట్లాడలేదు.

"సూడరా! లాంచీలో యెంతమంది పోతున్నారో?" అన్నారు గుడారంలోంచి ఎవరో.

"గానీరా! మన నావలు చుక్కల్లా తేలిపోతాయి. అప్పుడు చెబుదాము నాంచీలపని" అని నాకు నామకడతా నన్నవాడన్నాడు.

"యీళ్ళజిమ్మడ గాలడేలోపల నాంచివోళ్లు తీర్థంలోని జనాన్నందర్ని యెక్కించుకుపోయేలాగున్నారు!" యీసారి గుడారంలోంచి ఆడగొంతు వినిపించింది.

"అయ్యగారూ, నావెక్కకపోతే మానీగానండి నీడకొచ్చి కూర్చోండి. లాంచివచ్చాక వెళ్లుదురుగాని" అన్నాడు గుడారంలోకి వెళుతూ.

"మాలాంచి రావాలోయ్. అందుకోసమొచ్చాను" అని సమాధానం చెబుతూ గుడారంలో ప్రవేశిస్తూ గుంపులోకి చూశాను. గుంపులోనుంచి కెంపువంటి కన్నె కిలకిలా నవ్వింది. అందం నాకు నచ్చేలా దిద్దుకోవడం వల్లనే ఆమె నాకంత ఆకర్షణీయంగా కనపడుతోన్నదనే సంశయం నాలో రేగినా అట్టేసేపు నిలవలేక పోయింది.

గుడారంలో ఓమూల కూర్చుని గుంపులోని మగాళ్ళతో పిచ్చాపాటీ మాట్లాడుతూ దొంగతనంగా ఆమెవైపు చూస్తున్నా. ఆమెకూడా అల్లరిచూపులు చూస్తోంది.

ఎండ నెమ్మదిగా తగ్గి చల్లబడుతూంది. పైరుగాలి జల్లుజల్లుగా వీస్తూవుంది. దూరంగా నది కనిపిస్తున్నంత మేర మాలాంచిజాడ యెక్కడా లేదు. ఆమెను చూస్తూవున్న కుతూహలంలో లాంచిరావటంలేదన్న తొందర మాయమయింది.

నాకు నావకడతానన్నవాడు నిన్నటినించి తీర్థంలో జనాన్ని దాటేసి నాలుగు రూపాయిలు పాట్డానని ఒక్కొక్కప్పుడు చేపల వేటలో అంతకన్నా ఎక్కువ సొమ్ము దొరుకుతుందని చెపుతున్నాడు.

ఆమె జడ అల్లుకోవటం ముగించి ఒక ముసలమ్మతో కలిసి తీర్థంలోకి బయలుదేరింది. ఆమె వెళ్లాక నేను తీర్థంలోకెళ్ళి టీ తాగి వస్తానని మాట్లాడుతున్న వాళ్ళతో చెప్పి లాంచి అంతవరకు రానందుకు విసుక్కుంటున్నట్లు నటించి బయలు దేరాను.

తీర్థంలో మనుషులు చాలా పలచబడ్డారు. అందువల్ల ఆమె అట్టేసేపు వెతుక్కోకుండానే కనబడింది. ఆమె పూసలు దండ కొనుక్కొంటున్న దుకాణం యెదురుగుండా వున్న దుకా

చెరుకువాడ శ్రీరామమూర్తి

ణం ముందు నిలబడి ఒక ఆట వస్తువు ధర అడుగుతున్నాను.

"ఆ బాతెంతండీ?" వీపు మీదినుంచి ఆమె గొంతు.

వెనక్కి తిరిగి ఆశ్చర్యంతో, "అర్ధరూపాయ" అన్నాను.

ప్రసంగం పొడిగించాలంటే యీసారి నేనే మాట్లాడాలి. కాని యేమీ తోచక ఆమెవైపు చూస్తూ మౌనంగా వుండిపోయాను.

సన్నగా నవ్వుకుంటూ ఆమె వెళ్ళిపోయింది.

త్వరగా అయిదారు రూపాయిల సామాను కొని బయలు దేరాను. నేనూ రేవులోకి చేరే టప్పటికి గుడారం చేరువగా మా లాంచి ఆగుతూంది. ఆమెతో వచ్చిన ముసలమ్మ అప్పుడే గుడారంలోని కెళుతోంది. ఆమె కనబడలేదు. అంతలో మా సరంగు నన్ను జూచి లాంచి దిగి గబగబా నా దగ్గరకు వచ్చి నా చేతిలోవున్న సామాన్లందుకున్నాడు.

"శాస్త్రి వచ్చాడా?" అన్నాను.

"రాలేదండి! వారికోసమే యింతసేపు కష్టపడుకూర్చున్నాం" అన్నాడు.

"బలేపనిచేశారు. అతను రాకపోతే వచ్చే య్యాక పోయారా? వచ్చే నాలుగు డబ్బులు పాడు చేశారు. తొందరగా జనాన్ని వేసుకుని వెళ్ళండి! నేను మళ్లీ ట్రిప్పులో వస్తాను" అని కోపం చేసి గుడికి బయలుదేరా. రానందుకు శాస్త్రిని నిందించుకుంటూ, తీర్థం లోంచి గాకుండా అడ్డుదారిని యిసుక తిన్నెమీద గుడి వైపు నడుస్తున్నా.

పట్టిసం గుడి సాయంత్రపు నీరెండలో మైలు దూరం నుంచి అందం వెదజల్లుతోంది. మూడు ఫర్లాంగులు నడిచి రెండు నిలువుల యెత్తున గోడలావున్న యిసుకదిబ్బ ఆయాసంతో ఎక్కి పల్లందిగుతూ త్రుళ్ళిపడ్డా. నాకు వందగజాల్లో ఆమె యిసుకలో కూర్చుని ఆడుకుంటూవుంది. పైరు గాలిలో ఆమె ముంగురులు నాట్యంచేస్తున్నయ్.

ఆ గేటప్పటికి నేనామెకు నాలుగు గజాల్లో వున్నా.

"కూర్చోండి. నిలబడివుంటే మా వాళ్ళకు కనబడతారు" అన్నది.

ఆమె నవ్వులోని ఆకర్షణలనించి తప్పించుకొని వెనక్కి చూశాను. దూరంగా గుడారం పైభాగం మాత్రం కనబడుతూంది.

"ఏమండీ రాజమండ్రి వెళ్ళాలంటే ఎలా?"

"లాంచిలో వెళ్ళొచ్చు. లేకపోతే పడవ మీద అవతలి గట్టుకు వెళ్ళితే అక్కడనుంచి బస్సులుంటాయి. ఏం, రాజమండ్రీ వెళ్లాలా?" అన్నాను యిసుకలో కూర్చుంటూ.

"అవునండి!" అన్నది కళ్లల్లో చిరునవ్వు మెరిపిస్తూ.

"ఎప్పుడు?"

"రాత్రికి వెళ్ళాలండి. యిక్కడ నాకు బాగా లేదు."

"పోనీ నాతో వచ్చి రాత్రి మా వూళ్ళో వుండి ఉదయం వెళ్లకూడదూ?" అన్నాను.

"ఆడదానికి యిల్లు కదలి వెళ్లటానికి ఎన్ని ఆటంకాలుంటాయో ఆలోచించారా?" అన్నది.

"తోచకపోవటం సహజమే కాని నీవు మీ వాళ్ళలా ఉండక నాగరీకంగా వుండడం వల్ల కలిగిన సంశయం నన్నలా అనిపించింది" అన్నాను.

"కోపం తెచ్చుకోమాకండి నేను నిజం మాట్లాడలేదూ?"

"ఒప్పుకున్నాను."

"అయితే ఒక పని చేస్తారా?" కుడిచేత్తో గోదావరివైపు చూపిస్తూ "సరిగ్గా నేను చూపిస్తున్న తిన్నగా గోదావరి ఒడ్డున రాత్రికి నాకోసం చూస్తూ వుండండి. మావాళ్లు నిద్ర పోగానే నేను నావ తవ్వుకొని వస్తాను. ఇద్దరం అందులో నదిదాటి వెళ్లుదాం. అప్పుడు



నన్ను మీవూరు తీసుకొని వెళ్లవచ్చు" అన్నది. ఆమె కళ్లల్లోని కాంతి చూశాను కాని భావం గుర్తించలేకపోయాను.

"తప్పకుండా అలా చేస్తా. ప్రొద్దున్నే నిన్ను రాజమండ్రి పంపుతాను."

"ఇంతా కష్టపడి అర్థరాత్రి ప్రమాదాలన్నీ తప్పించుకొని వస్తే తెల్లారగానే నా పీడ వదలించుకోవాలని చూస్తున్నారా? బలేవారండీ!" అన్నది గట్టిగా నవ్వుతూ.

"నీవేగా రాజమండ్రి వెళ్ళాలన్నావ్? మా వూళ్ళో పడేట్లుండు. అంతకంటే నాకేం కావాలి!" అన్నాను.

ఆమె సంతోషంతో చిరునవ్వు నవ్వుకొని "రాత్రి పన్నెండు గంటలు మరచిపోయామా కండేం. వెళ్తాను, చాలా ఆలస్యమయింది" అని లేస్తూ "అమ్మో మా వాళ్లు వస్తున్నారండోయ్" అన్నది. ఆమె గొంతులో భయం తుళ్ళి పడింది.

ఆమె చూస్తున్న వైపు చూశాను. నలుగురు మనుష్యులు మా వైపు వస్తున్నారు. అందులో యిద్దరి చేతుల్లో కర్రలున్నై. ఒక్కసారిగా భయం నాలో విద్యుచ్ఛక్తిలా వ్యాపించింది. ఎలావున్నవాణ్ణి అలా వుండిపొయ్యాను. మెదడు ఆలోచించడం మానేసింది.

"అంత భయపడ్డారెందుకండీ! ఏమీ తప్పు చెయ్యకుండానే?" ఆమె మాటలు బలవంతాన అర్థం చేసుకుంటూంటే, "మా వాళ్లు అడిగితే మీరు నన్ను రాజమండ్రి పడవల రేవులో చూశాననీ, ఆ జ్ఞాపకంతో యిప్పుడు పలకరించి మాట్లాడుతున్నానని చెప్పండి. పడవల రేవు మరిచిపోకండేం?" అన్నది. నాకు మరుపెక్కువని ఆమెకెలా తెలిసిందో అంత భయంలో ఆశ్చర్యం వేసింది. నలుగురు మనుష్యులూ మమ్ములను సమీపించే వరకూ మేము మౌనంగానే వుండిపోయాము. అప్పుడామె లేచి వాళ్ళదగ్గరకు వెళ్ళి నిలుచుంది.

"ఏంజేస్తున్నావు?" అన్నాడొకడామెతో.

"నన్నాయన రాజమండ్రిలో చూశారట. అందుకని మీది రాజమండ్రియేనా అని అడుగుతున్నారు. అవునని చెపుతున్నా. అంతట్లో వచ్చారు!" అని నవ్వుతూ అన్నది. ఆ నవ్వులోని అమాయికత్వం నాకు ధైర్యం కల్పించింది.

"ఎవరు నువ్వు?" అన్నాడింకొకడు. అతని సంబోధనలోని అధికారం నన్ను హింసించింది.

"ఇందాక మీ గుడారంలో కూర్చో లేదూ?" ఒకగంటలో అతని దృష్టిలో మారిన నా విలువకు కారణం గుర్తించి అభిమాన పడుతూ అన్నాను.

"ఒంటరిగా ఐచ్చిన ఆడపిల్లతో యేమిటి మాట్లాడుతున్నావ్?" అని కర్ర చేతిలో వున్నవాడు ప్రశ్నించాడు.

"నే నిలా గుడికి వెళుతుంటే యెదురైంది. యెప్పుడో రాజమండ్రిలో చూసిన జ్ఞాపకముండి పలకరించాను. అవునని సమాధానం చెబుతూంది. అంతలో మీరు రావటం చూశాం"

"ఇంకేమీ చెయ్యలేదూ" నాల్గోవాడన్నాడు.

"ఆమెనే అడగండి?" అన్నాను.

ఆమె నా తెలివి తక్కువతనానికి నవ్వుతున్నది.

"తరవాత నీవెంత గొప్పోడవైనా సరే నిన్ను కొట్టేద్దామని వచ్చాం. ఏంటో నీముఖం చూశాక ఆకోపమంతా నీరైపోయింది. ఎప్పుడూ వొంటరిగావున్న ఆడపిల్లను పలకరించమాకు" కర్ర యిసుకమీద రాస్తూ అన్నాడు.

"యింక వెళ్లు బతికిపోయావ్!" రెండోవాడు హెచ్చరించాడు. మాట్లాడకుండా బయలుదేరాను.

అవమానం అంతగా మనస్సును హింసించగలదని నే నెప్పుడూ ఊహించలేదు.

కొండ యెక్కుతూ ఒకసారి కాలు జారి తూలి సర్దుకున్నాను. నేను గుడ్డిగా గుడిలో ప్రవేశించేటప్పటికి అర్చకుడు అమ్మవారికి సంధ్య భోగము నివేదిస్తూ వున్నాడు.

నే నలానే అమ్మవారిని చూస్తూ నిలబడిపోయాను.

"అర్చన అయిపోయి ఐదు నిముషాలైనా అలాగే నిలబడి చూస్తున్నావేమిటా మూర్తీ" శాస్త్రి మందలింపుకి వెనక్కు తిరిగాను. రెండు నిమిషాల తరువాత శాస్త్రి తన ఆలస్యానికి కారణాలు చెపుతూంటే వింటూ అతనితో నడిచి వెళ్ళాను, లాంచీకోసం.